

పెద్ద లోటు

తుమ్మలకు సాహిత్య వర్గాల నివాళి

కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ వర్సిటీ మాజీ వీసీ, కథారచయిత తుమ్మల మరణంపై వర్సిటీ వర్గాలు, సాహిత్య వర్గాలు సంతాపం ప్రకటించాయి. ఆయన సాహిత్య కృషినీ, తమ అనుబంధాన్నీ పలువురు గుర్తు చేసుకుంటున్నారు.

ఆయన రాయాల్సింది ఇంకా చాలానే ఉంది. రాస్తాననీ చెప్పాడు. భోళా మనిషి. వృత్తి కథలకు దారి చూపి వెళ్లిపోయాడు. గొప్ప స్నేహశీలిని కోల్పోయాం.

- మధురాంతకం నరేంద్ర, కథా రచయిత

1980లలో ఎస్వీయూనివర్సిటీ ఎఫ్ బ్లాక్‌లో తుమ్మల రామకృష్ణతో మొదలైన పరిచయం నాతో సహా సాహిత్య వర్గాలకు గట్టి స్నేహంగా మారింది. మా అందరిలోకీ చిన్నవాడు. అందరం చినబ్బా అని పిలిచేవాళ్లం. ఆయన లేడంటే నమ్మలేకున్నాం.

-ప్రొఫెసర్ డి.కిరణ్ క్రాంత్ చౌదరి

ఆయన లేని లోటు బహుజన సాహిత్యాన్ని ఎక్కువగా బాధిస్తుంది. ఆయన కథలు 'అడపం మేలుకొంది', 'మహా విద్వాంసుడు' బహుజన సాహిత్యానికి ప్రతీకలుగా నిలిచాయి.

- శ్రీదేవి, ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు

చదువుకునే రోజుల్లో గాంధీరోడ్డులోని డీలక్స్ హోటల్ గురువు కేతు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సాహిత్య చర్చలు జరిగేవి. తుమ్మల క్రియాశీలి. ఒక చిన్న పల్లె నుంచి బీసీ నేపథ్యం నుంచి వచ్చి హైదరాబాదు సెంట్రల్ వర్సిటీ ఆచార్యుడుగా చేరి, ఒక వర్సిటీ వైస్ చాన్సలర్ అయ్యాడు. గొప్ప మిత్రుడిని కోల్పోయాం.

- డాక్టర్ వి.ఆర్.రాసాని, రచయిత

మూగబోయిన బహుజన స్వరం

ద్రావిడ మాజీ వీసీ, కథారచయిత తుమ్మల రామకృష్ణ మృతి



కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):తెలుగు కథా సాహిత్యంలో బహుజన స్వరాన్ని బలంగా వినిపించిన ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ మృతి, సాహిత్య వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసిన ఈయన సోమవారం ఉదయం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఆఖరి శ్వాస విడిచారు. కథా రచయితగా ప్రసిద్ధుడైన ఆచార్య తుమ్మల రామకృష్ణ స్వస్థలం చిత్తూరు జిల్లా సోమల మండలం ఆవులపల్లె గ్రామం. పెద్దఉప్పరపల్లె, నెరబైలు గ్రామాలలో హైస్కూలు దాకా చదువుకున్న ఆయన ఇంటర్మీడియట్ తిరుపతిలో చదువుకున్నారు. శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో ఎంఫిల్, పీహెచ్‌డీ తీసుకునేదాకా ఉన్నత విద్యాభ్యాసం సాగింది. హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు ఆచార్యుడిగా పదవీ విరమణ చేసిన తర్వాత ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా 2020లో నియమితులయ్యారు. 2023, నవంబరు 25న ఇక్కడే పదవీ విరమణ చేశారు. ద్రావిడ యూనివర్సిటీ రాజకీయాల్లో ఆయన నలిగిపోయారు. ఈ సమయంలోనే అనారోగ్యానికి కూడా గురయ్యారు. హైదరాబాదులోని లింగంపల్లిలో ఉంటూ చికిత్స తీసుకునేవారు.

బహుజన కెరటం: తుమ్మల కలం బహుజన ధిక్కార స్వరం. 'అడపం మేలుకొంది' అన్న తుమ్మల కథ చిత్తూరు జిల్లా ఊళ్లల్లో నేటికీ మారని బహుజనుల జీవితాల వేదన తెలియజేస్తుంది. తుమ్మల రామకృష్ణ రాసిన 'మహా విద్వాంసుడు' కథ - సంగీతంలోని వివక్షను ఎత్తి చూపుతుంది. ఊబి, ఊరిమద్దిస్తం, ఓ సాయంత్రం, డాక్టర్ గుర్నాథం, పరాభవం, రాలిన చింత, రేగడిమిట్ట, స్పెషల్ స్క్వాడ్ వంటి కథలతో ' మట్టిపొయ్యి' సంపుటి ప్రచురించారు. తెల్ల కాకులు అనే కథను పుస్తకంగా ప్రచురించారు. ఇది అనేక భాషల్లోకి అనువాదం అయ్యింది. కర్నూలులో కథా సాహిత్య వాతావరణాన్ని పునరుజ్జీవింపజేసిన కథకుడిగా తుమ్మలను గుర్తిస్తారు. ఇక్కడి నుంచి ఆయన చొరవతో వచ్చిన 'పల్లెమంగలి కథలు' తెలుగు కథాసాహిత్యంలో బహుశా తొలి వృత్తి కథల సంకలనం. ఆయన సారథ్యంలోనే అడపం పేరుతో వృత్తి కథల సంకలనం వెలువడింది. 'పరిచయం', 'బహుముఖం', 'అవగాహన' వ్యాస సంపుటాలు, 'అభిచందనం' పేరుతో సమీక్షలు - ప్రసంగాలు పుస్తకాలుగా వెలువడ్డాయి. ఆయన రచనలు అనేకం తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటూ మరాఠీ, హిందీ, ఇంగ్లీషుల్లోకీ అనువాదం అయ్యాయి. ఆయన సాహిత్య కృషిపై పలువురు రాసిన వ్యాసాలతో 'సీమ సంతకం' అనే పుస్తకం వెలువడింది. ఎనభైల తర్వాత ఊపందుకున్న అస్తిత్వ ఉద్యమాల జాడలు తుమ్మల రామకృష్ణ రచనల్లో కనిపిస్తాయి. స్వయంగా ఒక బహుజనునిగా పొందిన అనుభవాలు, సంవేదనల ప్రతిధ్వనులు వినిపిస్తాయి. ఆయన ఎలుగెత్తిన బహుజన ధిక్కార స్వరం ఇంకా గట్టిగా, వేయిగొంతుకుల పెట్టుగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

కోరుకున్న వేళకే..

స్థిరాస్తి రిజిస్ట్రేషన్

రేపటినుంచి స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభం

ప్రయోగాత్మకంగా చిత్తూరు ఆర్వోలో అమలు



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తాము కోరుకున్న వేళకే స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. ఇందుకోసం బుధవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించనుంది. ఈ నూతన ప్రక్రియను జిల్లాలోని చిత్తూరు రెవెన్యూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఆర్వో)లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ప్రస్తుతం శుభ ముహూర్తాలు చేసుకుని ఎక్కువమంది స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. దీనివల్ల కొనుగోలు, విక్రయదారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. దీనికి స్వస్తి పలకడానికి కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. స్లాట్ బుకింగ్ విధానంపై జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బందికి, రాష్ట్ర స్థాయిలో ఐజీ కార్యాలయంలో ఇదివరకే సిబ్బందికి పలు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆనవాయితీగా..

పదేళ్లగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన ప్రతి ప్రక్రియకు చిత్తూరు ఆర్వోను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ విజయవంతమయ్యాక దశలవారీగా జిల్లాలోని మిగతా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలిలా..

- గంటలు, రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితికి స్వస్తి
- క్రయ, విక్రయదారులతోపాటు అధికారులు, సిబ్బందికి ఒత్తిడి ఉండదు.
- దళారులు, డాక్యుమెంటు రైటర్ల ప్రభావం తగ్గుతుంది.
- దస్తావేజులు, దరఖాస్తులను సరిచూసుకోవడంలో గతంలో లాగా గందరగోళం ఉండదు.
- వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు దూరం
- అధికారులతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేయడానికి తగిన వాతావరణం ఉంటుంది.
- వీలునామా వంటి కీలక దస్తావేజుల్లో రాసిన వివరాలను చదివి, వినిపించే సమయంలో నిశ్శబ్ద వాతావరణం ఉంటుంది.

సేవలు పొందాలంటే..

- ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ ఎంపిక చేసుకుని వివరాలు పొందుపరచాలి.
- రిజిస్ట్రేషన్, ఇతర సేవలకు తమకు నచ్చిన తేదీ, సమయాన్ని ఎంచుకున్నాక క్యూఆర్ కోడ్‌తో ఒక టోకెన్ వస్తుంది.
- ఆ సమయానికి సంబంధిత టోకెన్, దస్తావేజులు, దరఖాస్తులతో కార్యాలయానికి వెళ్లి హాజరైతే గంట వ్యవధిలోనే ప్రక్రియ పూర్తవుతుంది.
- ఎనీవేర్ విధానంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలంటే మాత్రం నిర్ణీత తేదీకి ముందురోజు సంబంధిత దస్తాలను సంబంధిత కార్యాలయానికి ఆన్‌లైన్‌లో చేరేలా చూసుకోవాలి.
- స్లాట్ బుకింగ్ విధానం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది.
- స్లాట్ బుకింగ్ సేవలకు ఎలాంటి రుసుం ఉండదు.
- ఒకవేళ ఈ సేవలను రద్దు చేసుకోవాలంటే రూ.100 చెల్లించాలి. తిరిగి అదే సేవలను పొందాల్సి వస్తే రూ.200 కట్టాలి.

నేడు ఐచ్ఛిక సెలవు లేదు

యథావిధిగా బడులు పనిచేస్తాయి : డీఈవో

చిత్తూరు సెంట్రల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్ణయించుకున్న స్థానిక ఐచ్ఛిక సెలవులు పూర్తిగా వాడుకోవడం జరిగిందని డీఈవో వరలక్ష్మి తెలిపారు. అందువల్ల మంగళవారం జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల యాజమాన్యాలకు ఎలాంటి సెలవు లేదన్నారు. బడులు యథావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తప్పక విధులకు హాజరు కావాలన్నారు.

నేటినుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్లు మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 2,65,067 మంది పింఛనుదారులకు అవసరమైన రూ.112.79 కోట్లు జిల్లాకు వచ్చాయన్నారు. పింఛన్ల పంపిణీపై ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లలో సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలి రోజున మొదటి నాలుగు గంటల్లోపు పొరపాట్లు లేకుండా పంపిణీ పూర్తయ్యేలా పర్యవేక్షించాలని చెప్పారు. గత నెలలో వివిధ కారణాలతో పింఛన్ తీసుకోని వారికి ఈ నెలలో ఆ సొమ్ము అందజేయాలన్నారు.

'మండే' ఎండలు

విలవిల్లాడుతున్న జనం



చిత్తూరులో బోసిపోయిన రాజీవ్‌గాంధీ రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో సోమవారం ఎండలు జనాన్ని భయపెట్టాయి. కొందరు రక్తపోటుకు గురవగా, ఇంకొందరు చక్కెర శాతం తగ్గి ఆస్పత్రి పాలయ్యారు. ఇంకా రెండు, మూడ్రోజులపాటు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. నగరి మండలంలో అత్యధికంగా 38.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాలవారీగా.. గంగవరంలో 37.3, ఎస్ఆర్‌పురంలో 37.1, గుడుపల్లె, కుప్పం, శాంతిపురంలో 37, నింద్రలో 36.8, పులిచెర్ల, రొంపిచెర్లలో 36.5, గుడిపాల, చిత్తూరులో 36.4, సోమలలో 36.1, విజయపురం, ఐరాల, చౌడేపల్లె, పాలసముద్రం, పెనుమూరులో 36, పూతలపట్టు, సదుం, వెదురుకుప్పంలో 35.9, వి.కోటలో 35.8, పెద్దపంజాణిలో 35.5, యాదమరిలో 35.1, రామకుప్పంలో 34.9, గంగాధరనెల్లూరులో 34.8, కార్వేటినగరంలో 34.3, పలమనేరులో 34.2, పుంగనూరులో 33.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వరసిద్ధుడికి కానుకగా వెండి ఊయల



ఆలయాధికారులకు వెండి ఊయలను అందిస్తున్న దాతలు

ఐరాల(కాణిపాకం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పవళింపు సేవకు వినియోగించే వెండి ఊయలను సోమవారం హైదరాబాదుకు చెందిన రాధిక, హరికృష్ణలు కానుకగా అందించారు. 7.5 కిలోల బరువున్న ఈ ఊయల రూ.8,00,000 విలువ చేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. దాతలకు స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, ఆలయ మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.


పంటలపై గజరాజుల దండయాత్ర

ట్రాక్టర్‌నూ ధ్వంసం చేశాయి

ఏనుగులను చూసి భయపడి బావిలోకి దూకిన దూడ

ఆందోళనలో రైతులు

యాదమరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని దళవాయిపల్లె అటవీ ప్రాంతంలో తిష్ట వేసిన గజరాజుల గుంపు పంటలపై దండయాత్ర చేస్తోంది. ఆదివారం రాత్రి కూడా 14 ఏనుగుల గుంపు పొలాలపై పడింది. దళవాయిపల్లె గ్రామానికి చెందిన గజేంద్ర, మనోహర, చిన్నదొరై, ప్రసాద్‌లకు చెందిన వరి, అరటి, మామిడి, రాగి పంటలపై దాడిచేశాయి. దిగుబడి వచ్చే దశలో పంటలను నాశనం చేశాయని రైతులు వాపోయారు. గజేంద్రకు చెందిన ఓ ట్రాక్టర్‌ను కూడా ధ్వంసం చేశాయి. మనోహరకు చెందిన పొలంలోకి ఏనుగుల గుంపు వచ్చినపుడు వాటిని చూసి భయపడిన ఓ పేయదూడ సమీపంలో నీళ్లు లేని 30 అడుగుల బావిలోకి దూకేసింది. ఏనుగులు వెళ్లిపోయాక గాయపడ్డ దూడను గ్రామస్తులు బావి లోనుంచి అతికష్టంపై బయటకు తీశారు. ఏనుగుల వరుస దాడులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిద్రాహారాలు మాని పంటలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. గజరాజుల గుంపును అడవిలోకి మళ్లించడానికి బాణసంచా కాల్చుతూ అటవీశాఖ ట్రాకర్లు ప్రయత్నిస్తున్నారు. ధ్వంసమైన పంటలను ఎఫ్‌బీవో ప్రతాప్ తన సిబ్బందితో పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల దాడుల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



ఏనుగులు తొక్కేసిన వరిపంట



ధ్వంసమైన ట్రాక్టర్



ముస్లింలకు ఉపదేశమిస్తున్న ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా

సహనం, దయతో మెలగండి

ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా ● భక్తిశ్రద్ధలతో రంజాన్

చిత్తూరు కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సహనం, దయతో మెలగండని ముస్లింలకు ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా సూచించారు. రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిత్తూరు గిరింపేట ఈద్గా మైదానంలో ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. ఆయన ఉపదేశమిస్తూ.. సహనం అన్ని వేళలా మంచిదని చెప్పారు. ఇతరుల పట్ల ఆదరణ చూపించి అల్లా ఆశీర్వాదం పొందాలన్నారు. ప్రార్థనల అనంతరం పిల్లలు, పెద్దలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



ప్రార్థన చేస్తున్న చిన్నారి



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

కుప్పం గంగమ్మ ఆలయ చైర్మన్‌గా బీఎంకే రవిచంద్రబాబు ?



కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయ కమిటీ చైర్మన్‌గా బీఎంకే రవిచంద్రబాబు పేరు దాదాపు ఖరారైంది. ఇంకా అధికారిక ఉత్తర్వులు వెలువడకున్నా.. ఆయన పేరును ఖరారు చేస్తున్నట్లు కుప్పం పార్టీ వర్గాలకు సోమవారం సమాచారమందింది. రవిచంద్రబాబు 2015, 2016 సంవత్సరాల్లో రెండేళ్లపాటు గంగమ్మ ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ రెండేళ్లూ ఆయన ఆధ్వర్యంలో గంగ జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. అప్పట్లోనే దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను కుప్పం తీసుకొచ్చి పాటకచేరీ నిర్వహించిన ఘనత బీఎంకేకు దక్కింది. రవిచంద్రబాబుతోపాటు మరో పదిమంది ఆలయ కమిటీ సభ్యులుగా అవకాశం లభించినట్లు తెలిసింది. వీరిలో.. శారదమ్మ, నరేశ్, సింధు రాజ్‌కుమార్, మంజుల మణి, సంతోషమ్మ జయరామ్‌నాయుడు, ఎస్.మహేశ్, ఎన్.వినాయకన్, వెన్నెల శరవణ, వీపీ లక్ష్మి, జ్యోతీశ్ ఉన్నట్లు సమాచారం. మరో రెండ్రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

బియ్యం కొరత లేదు

● జేసీ లేఖకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు ప్రతినెలా పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం కోటాలో ఏప్రిల్ నెలకు సంబంధించి కోత విధించిన ప్రభుత్వం ఎట్టకేలకు సానుకూలంగా స్పందించింది. జేసీ విద్యాధరి రాసిన లేఖకు స్పందించి కోతను పూర్తిగా ఎత్తివేస్తూ ఇండెంట్ మేర ఏప్రిల్ నెల కోటా పొందవచ్చని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. దాంతో డీలర్లు, కార్డుదారులు ఆనందంలో మునిగారు. 2025 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో డీలర్ల వద్ద మిగులు వున్న స్టాకు బియ్యాన్ని పరిశీలించి ఉజ్జాయింపుగా 1100 టన్నుల బియ్యం కోటాను కత్తిరింపు చేసింది. దాంతో డీలర్లు గగ్గోలు పెట్టడంతో ప్రభుత్వానికి జేసీ లేఖ రాస్తూ పూర్తి కోటా విడుదల చేయాలని పేర్కొన్నారు. దాంతో పూర్తి కోటా తీసుకోవడానికి ప్రభుత్వం ఆదివారం అనుమతిచ్చింది. జిల్లాలో కార్డుదారులకు 8,300 టన్నుల బియ్యం కావాల్సి ఉండా, సోమవారం నాటికి 7,700 టన్నులు చేరగా, మిగిలిన 600 టన్నులు మంగళ, బుధవారాల్లో అందనున్నాయి. జేసీ లాగిన్ ద్వారా మండల తహసీల్దార్లు పెడుతున్న ఇండెంట్ మేర బియ్యాన్ని ఎం.ఎల్. పాయింట్ల ద్వారా విడుదల చేస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బాలకృష్ణ సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అలాగే 262 టన్నుల చక్కెర బదులు ఇప్పటి వరకు 220 టన్నులు జిల్లాకు అందిందన్నారు.

రూ.2 కోట్ల విద్యుత్ బిల్లుల వసూలు

చిత్తూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సెలవులైన ఆది, సోమవారాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యుత్ బిల్లు చెల్లింపు కేంద్రాలు పనిచేశాయి. దీంతో రూ.2.08 కోట్ల మేర విద్యుత్ బిల్లులు వసూలయ్యాయని ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్ర నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండ్రోజుల్లో 23,800 మంది వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించారని వారు పేర్కొన్నారు.

నేటినుంచి రెండో విడత రీసర్వే

మండలానికి రెండు గ్రామాల్లో నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండలానికి రెండు గ్రామాల చొప్పున రెండో విడత భూముల రీసర్వే మంగళవారం నుంచి చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వైసీపీ హయాంలో జరిగిన రీసర్వే తప్పులతడకగా ఉండడంతో లోపాలను సరిదిద్ది, రైతుల అభ్యంతరాలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తొలి విడతగా మండలానికి ఒక గ్రామంలో ప్రయోగాత్మకంగా రీసర్వేను 2025 జనవరి 20వ తేదీన ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తిచేయడానికి నాలుగు నెలల సమయాన్ని ఇచ్చింది. జిల్లాలో 31 మండలాల్లో 31 గ్రామాల్లో రీసర్వే మొదలుపెట్టింది.

అక్కడక్కడా సర్వే పూర్తయింది



జిల్లాలో తొలివిడతలో 30,295 ఎకరాల్లో సర్వే చేపట్టాం. అక్కడక్కడా సర్వే పూర్తయ్యింది. 145 రోవర్లు ఉన్నాయి. 91 యూనిట్లుగా సర్వే చేపడుతున్నాం. సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే.

- టి.జయరాజ్, సర్వే, భూరికార్డుల శాఖ ఏడీ

బ్లాక్‌లుగా విభజించి..

- తొలివిడత సర్వేలో ఒక గ్రామంలో మొత్తం భూమిని బ్లాక్‌లుగా విభజించారు. ఒక్కో బ్లాక్‌లో 250 ఎకరాలున్నాయి.
- సర్వే బృందాల విషయానికొస్తే ఒక బందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రెవెన్యూ సహాయకుడు ఉన్నారు.
- ఈ బృందం రోజుకు 20 ఎకరాల్లో సర్వే చేసి, హద్దులు నిర్దేశిస్తుంది. రైతులను పొలాల వద్దకు పిలిచి గ్రౌండ్ ట్రూథింగ్ చేస్తుంది.
- ఇదంతా పూర్తయ్యాక రికార్డుల తయారీ మొదలుపెడతారు.
- సర్వే పూర్తికే 40 రోజుల సమయం, క్షేత్రస్థాయిలో సేకరించిన కొలతలతో రికార్డుల తయారీకి రెండు నెలలు పడుతుంది.

ఆందోళనలో సిబ్బంది

తొలి విడత గడువు పూర్తికాకుండానే రెండో విడత సర్వే చేపట్టాలని ఆదేశించడంతో సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా చేస్తున్న రీసర్వే వందశాతం కచ్చితత్వంతో పూర్తయ్యాకే రెండో విడత చేపట్టాలని వారంటున్నారు.

సమస్యలకు పరిష్కారం చూపెడితేనే..

గ్రామ రెవెన్యూ అధికారులకు రీసర్వేతోపాటు 20కి పైగా ఇతర పనులు అప్పజెప్పారు. వీరు కొద్దిరోజులుగా తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదు. రైతులు సకాలంలో రాకపోవడంతో అనుకున్న సమయంలో రీసర్వే పూర్తికావడం లేదు. రోవర్లకు సిగ్నల్స్ అందక కొన్నిసార్లు పని స్తంభిస్తోంది. అందరికీ ల్యాప్‌టాప్‌లు లేకపోవడం మరో సమస్య. రైతుల అభ్యంతరాలను పరిష్కరించాలంటే పలుమార్లు భూమి వద్దకు వెళ్లి ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వారి సమక్షంలోనే రీసర్వే చేయాలి. ఇదంతా అయ్యాక 13 ప్రకటన ఇచ్చి ప్రక్రియ పూర్తిచేసినట్లు ప్రకటించాలి. ఫలితాల్లో కచ్చితత్వం ఉండాలంటే మరికొంత సమయం ఇవ్వాలని క్షేత్రస్థాయి సర్వే సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యలను అధికారులు ఎక్కడికక్కడ పరిష్కారం చూపెడితేనే రెండో విడత రీసర్వే చేయడం సులువు అవుతుంది.

బోయకొండ గంగమ్మ సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



న్యాయమూర్తి రోజాక్షికి అమ్మవారి ప్రసాదాలు అందిస్తున్న ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను కర్ణాటక రాష్ట్రం హైకోర్టు జడ్జి రోజాక్షి సోమవారం దర్శించుకున్నారు. న్యాయమూర్తి.. కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనానికి రాగా.. ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో ఏకాంబరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

జీతాలు, పెన్షన్, కంటిన్జెన్సీ బిల్లులకు ఓకే

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించి ఏప్రిల్ 1 లేదా 2 తేదీల్లో చెల్లింపులు జరగాల్సిన మార్చినెల జీతాల బిల్లులను ఖజానాశాఖ అధికారులు సోమవారం రాత్రి పాస్ చేసి ఓకే చేశారు. దీంతోపాటు ప్రభుత్వ పెన్షనర్ల ఫ్యామిలీ పెన్షన్, పర్సనల్ పెన్షన్ చెల్లింపులకు మార్గం సుగమం చేశారు. వీటితోపాటు అద్దె వాహనాల బిల్లులు, నష్టపరిహారం వంటి కంటిన్జెన్సీ బిల్లులు, బడ్జెట్, నాన్-బడ్జెట్ బిల్లులను ఆది, సోమవారాల్లో ఖజానాశాఖ ఆయా శాఖల వీడియోలు పంపిన వాటిని పరిశీలించి చెల్లింపులకు సీఎఫ్ఎంఎస్‌కు తరలించారు. కాగా ప్రభుత్వం నుంచి పెద్దమొత్తాలలో ఎటువంటి చెల్లింపులకు ఆమోదాలు తెలపలేదని తెలియవచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండ్రోజులు ఖజానాశాఖ ఉద్యోగులు విధులకు హాజరయ్యారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు రసీదును అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి నాగర్‌కర్నూల్‌కు చెందిన సురేంద్రరెడ్డి రూ.1,00,116లు ఆన్‌లైన్ ద్వారా విరాళం పంపించారు. ఈమొత్తానికి చెందిన రసీదును సోమవారం దాతకు అందజేసి, దర్శన ఏర్పాట్లు చేసినట్లు ఏఈవో రవీంద్రబాబు తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చిత్తూరు డీవైఈవో మృతి



చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చిత్తూరు డివిజనల్ విద్యాశాఖాధికారి (డీవైఈవో) చంద్రశేఖర్ హైదరాబాదులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 6.30 గంటలకు మృతి చెందారు. మదనపల్లె టౌన్ ప్రశాంతనగర్‌కు చెందిన ఈయన తొలుత 1989లో పుత్తూరు ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. 2022 సెప్టెంబరు ఒకటో తేదీన చిత్తూరు డీవైఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. సమస్య తీవ్రం కావడంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మంగళవారం మదనపల్లెలో అంత్యక్రియలు జరగనున్నాయి. ఈయన మృతికి డీఈవో వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వరావులు, డీఈవో కార్యాలయ సిబ్బంది, ఎంఈవో సెల్వరాజ్, హెచ్ఎం సంఘం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ సంతాపం తెలిపారు. చిత్తూరు డీవైఈవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి, నివాళి అర్పించారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా..

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న పాల ట్యాంకర్
- సురక్షితంగా బయటపడ్డ మనవరాలు
- అవ్వ దుర్మరణం, తాతకు తీవ్రగాయాలు



పాల ట్యాంకర్ టైరు కింద రాజేశ్వరి మృతదేహం (ఇన్‌సెట్లో) ఫైల్ ఫొటో



గాయపడ్డ చంద్రశేఖర్ శెట్టి, రోదిస్తున్న జ్యోతిక

బంగారుపాళ్యం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మనవరాలు జ్యోతికతో కలిసి బంగారుపాళ్యం మండలంలోని మొగిలిలో ఉన్న మొగిలీశ్వరుడిని తవణంపల్లె మండలం అరగొండ పైమాఘానికి చెందిన చంద్రశేఖర్ శెట్టి, రాజేశ్వరి దంపతులు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై మొగిలి దేవాలయానికి సమీపంలోని మలుపు వద్దకొచ్చేసరికి పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న పాల ట్యాంకరు వీరిని ఢీకొట్టింది. రాజేశ్వరి పాల ట్యాంకరు టైరు కింద పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. చంద్రశేఖర్ శెట్టి, జ్యోతిక మాత్రం రోడ్డు పక్కన పడిపోయారు. మనవరాలు సురక్షితంగా బయటపడగా, తాతకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. అవ్వ మృతి చెందడం, తాతకు తీవ్రగాయాలవడాన్ని తట్టుకోలేక జ్యోతిక రోదించడం చూసిన వారంతా కంటతడి పెట్టారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.1.23 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సెలవురోజుల్లో సైతం కల్పించిన సౌకర్యంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆది, సోమవారాల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో రూ.1.23 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. తిరుపతి బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా ద్వారా ఆదివారం 40 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.34 లక్షలు, సోమవారం 75 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.64 లక్షలు వెరసి 115 రిజిస్ట్రేషన్లతో రూ.98 లక్షలు ఆదాయం అందింది. చిత్తూరు రిజిస్ట్రేషన్ జిల్లా ద్వారా ఆది, సోమవారాల్లో 117 రిజిస్ట్రేషన్లతో రూ.25.18 లక్షలు ఖజానాకు చేరింది. ఆదివారం 55 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.9.10 లక్షలు అందగా, సోమవారం 62 రిజిస్ట్రేషన్లతో రూ.16.04 లక్షలు రాబడి వచ్చింది. ఎస్ఆర్‌ల వారీగా కుప్పంలో 18, పలమనేరులో 14, పుంగనూరులో 11, చిత్తూరు ఆర్వోలో 8, బంగారుపాళ్యంలో 5, కార్వేటినగరంలో 4, నగరి, చిత్తూరు రూరల్‌లో ఒక్కొక్కటి చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లా డీఐజీ గిరిబాబు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రభుత్వాదేశాల మేర అన్ని ఎస్ఆర్‌లు ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేయగా, ఈ సౌకర్యాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకున్నారన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



మృతిచెందిన రోహిత్

పుంగనూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు మండలంలోని ఎంసీపల్లె పంచాయతీ పత్రపల్లెకి చెందిన వాసు కుమారుడు లోహిత్ (14) పుంగనూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం గ్రామంలోని స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి ఉన్న ఇనుప పైపులకు ముట్టుకోగా, వాటికి ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకున్నారు. లోహిత్‌ను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

పొట్టేలు మాంసం కటింగ్‌కు రూ.800లే తీసుకోవాలి

బోయకొండ గంగమ్మ ఆలయ ఈవో సూచన

చౌడేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో పొట్టేలు మాంసం కటింగ్ చేయడానికి భక్తుల నుంచి రూ.800 మాత్రమే తీసుకోవాలని గంగమ్మ ఆలయ ఈవో ఏకాంబరం సూచించారు. సోమవారం పొట్టేలు కటింగ్ చేసే వ్యాపారులతో సమావేశమయ్యారు. గతంలో క్లీనింగ్ (కటింగ్) కోసం టెండర్ నిర్వహించారన్నారు. ప్రస్తుతం టెండర్ లేకుండానే ఒక పొట్టేలు క్లీనింగ్ కోసం ఆలయానికి రూ.200, క్లీనింగ్ చేసేవారికి రూ.600 చెల్లించేలా ధర నిర్ణయించినట్లు చెప్పారు. వ్యాపారులు అధిక ధరలు వసూలు చేసినా.. మాంసం చోరీ చేసినా కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అలాగే పొట్టేలు తల క్లీనింగ్ రూ.200, కోడి క్లీనింగ్ రూ.50 ధరలుగా నిర్ణయించామన్నారు. అందరూ సహకరించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా చూడాలని కోరారు.

డాక్టర్ జగదీష్‌కు విశ్వవైద్య దివ్యాంగ బంధు అవార్డు



మారిషస్ ప్రధాన మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ జగదీష్

తిరుపతి (వైద్యం), మార్చి 31(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు విశేష సేవలందించడమేగాక ఎముకల వ్యాధి నివారణలో చేసిన కృషికి బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌కు విశ్వవైద్య దివ్యాంగ బంధు అవార్డు దక్కింది. మారిషస్ రాజధానిలోని ఫీనిక్స్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆ దేశ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్ చంద్రరామ్ గులామ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. పలువురు వైద్య నిపుణులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ముక్కంటి సేవలో హైకోర్టు జడ్జి జస్టిస్ కృపాసాగర్



తిరుచానూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జస్టిస్ కృపాసాగర్ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

ఒకటో సారి.. రెండో సారి.. మూడో సారి..!

పారదర్శక టెండర్లతో తిరుపతి కార్పొరేషన్‌కు పెరిగిన ఆదాయం

వైసీపీ హయాంలో గుట్టుచప్పుడు కాకుండా నొక్కుడు

ఒక్క మార్కెట్లోనే రూ.రెండు కోట్లకుపైగా వ్యత్యాసం



తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ జమానాలో చిన్నా చితకా వాటికి కూడా టెండర్లు గోప్యంగా జరిగిపోయేవి. ముఖ్యంగా తిరుపతి కార్పొరేషన్‌లో జరిగే టెండర్లలో గోల్‌మాల్ అంతా ఇంతా కాదు. బహిరంగ వేలం పేరు పెట్టి 'ఒకటోసారి.. రెండోసారి.. మూడోసారి..' అనే మాటలు లేకుండానే పనికానిచ్చేశారు. వేలంలో బయటవారు రాలేరు. వద్దామంటే అసలు టెండరు ఎప్పుడు జరుగుతుందో తెలియదు. తెలుసుకునే లోపు నాలుగు గోడల మధ్య చీటీలు వేసి పంచుకునేసేవారు. అన్న క్యాంటీన్లు మొదలుకుని, కపిలతీర్థం సర్కిల్ మెరిడియన్ హోటల్ వరకు, స్క్రాప్ టెండర్ నుంచి మార్కెట్ టెండర్ల వరకు, ఇంజనీరింగ్ పనులైతే ఏకనిరంజన్ పనికానిచ్చేవారు.

తాజాగా కార్పొరేషన్ పరిధిలో జరిగిన టెండర్లను పరిశీలిస్తే వైసీపీ హయాంలో అడ్డగోలుతనం బయటపడింది. 2024 వరకు ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండరు రూ2.58కోట్లు మాత్రమే. కూటమి అధికారంలోకి వచ్చాక జీఎస్టీతో కలిపి దాదాపు రూ.5 కోట్లకు ధర పలికింది. పాలకపక్షం పారదర్శకంగా టెండర్లు నిర్వహిస్తే మార్కెట్ అసలు ధర ఎంతో ఇప్పుడు బయటపడింది. అంటే గత వైసీపీ పాలనలో ఒక్క మున్సిపల్ మార్కెట్‌పైనే ఏడాదికి రూ.2 కోట్లకుపైగా కార్పొరేషన్ ఆదాయానికి గండి పడిందంటే తక్కినవాటిలో ఎంత నొక్కేసారో అర్థం చేసుకోవచ్చు.

పార్కింగ్ అడ్డాలనూ దోచేశారు

తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలనూ వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా దోచేశారు.

- 2022-23లో భారతి బస్టాండు పార్కింగ్ టెండరు రూ3.37లక్షలు. 2023-24కు దీనిని రూ2.23లక్షలకు తగ్గించి కట్టబెట్టారు. ఇదే బస్టాండుకు 2024-25లో రూ7.12లక్షలు, తాజాగా రూ10.40లక్షలు ధర పలికింది. అంటే వీటినుంచీ కార్పొరేషన్ ఆదాయానికి వైసీపీ హయాంలో గండి కొట్టేశారు.
- జీఎస్ మాడవీధి పార్కింగ్ స్థలాలు టెండరులోనూ భారీ వ్యత్యాసం కనిపించింది. వైసీపీ హయాంలో రూ1.25లక్షలు ఉన్న మాడావీధి టెండరు ప్రస్తుతం రూ3.35లక్షలతో రెండింతలు పలికింది.

రాజకీయ జోక్యం లేకపోవడంతో..

కార్పొరేషన్ పరిధిలో జరిగే టెండర్లలో రాజకీయ జోక్యం లేకపోవడం వల్లే పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించడంతో భారీగా ఆదాయం సమకూరింది. గతంలో వైసీపీ పెద్దలు చెప్పినట్టే అధికారులు తలలు ఆడించడంతో అయినవారికి కార్పొరేషన్ ఆస్తులను చౌకగా కట్టబెట్టేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో జనబాహుళ్యంలో ఉన్న పత్రికలకు ప్రకటనలు ఇచ్చి విస్తృత ప్రచారం చేసి టెండరు నిర్వహించడం వల్ల పాటదారుల్లో పోటీతత్వం పెరిగినట్టు కనిపిస్తోంది.

నాడు- నేడు వేలం పాటల వివరాలు

	కూరగాయల మార్కెట్	రామచంద్రగుంట కట్ట	జంతువధశాల	చిన్నవీధులు	భారతీ బస్టాండ్ పార్కింగ్ స్థలాలు	జీఎస్ మాడవీధి పార్కింగ్ స్థలాలు
2022-23	రూ. 2,30,40,000	రూ. 1,94,000	రూ. 3,18,600	రూ. 14,32,000	రూ. 3,27,000	----------
2023-24	రూ. 2,58,05,700	రూ. 2,15,554	రూ. 4,17,672	రూ. 15,90,948	రూ. 2,52,924	రూ. 1,25,676
2024-25	రూ. 4,81,50,000	రూ. 2,32,500	రూ. 4,27,500	రూ. 19,57,500	రూ. 7,12,500	రూ. 1,39,800
2025-26	రూ. 4,76,00,000	రూ. 2,34,000	రూ.4,00,000	రూ. 33,00,030	రూ. 10,40,000	రూ. 3,35,599

మామిడితోట దగ్ధం


సోమల-సదుం మార్గంలోని గుట్టలో మంటలు

సోమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) సోమల మండలం గాంధీనగర్‌కు చెందిన రమణయ్య మామిడి తోటలో మంటలు వ్యాపించి పలు చెట్లు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు తోట సమీపంలోని చెత్తకు నిప్పు పెట్టడంతో ఆమంటలు తోటలో వ్యాపించాయి. సమీపరైతులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పొలంలోని డ్రిప్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. ఇతర పొలాల వైపు మంటలు వ్యాపించకుండా రైతులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్య ంలో బాధితుడు రమణయ్య స్థానిక సచివాలయం, రైతు సేవా కేంద్రాల్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే సోమల - సదుం మార్గంలోని కోనమూల గుట్టకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. సమీప మామిడి రైతులు పొలాల వైపు మంటలు రాకుండా చర్యలు తీసుకున్నారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ సుబ్బారెడ్డి

రొంపిచెర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ సుబ్బారెడ్డి కోరారు. సోమవారం ముస్లింల పవిత్ర పండుగ సందర్భంగా ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశమై సూచనలు, సలహాలు ఇచ్చారు. రికార్డులు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినా.. చిన్నపిల్లలు వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో, ఆలయాలకు అలారం బీగాలు వేసుకోవాలని తెలిపారు. జూదం, కోడిపందేలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఎస్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది మందికి ఉగాది పురస్కారాలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు హిందూ సత్య ధర్మ దివ్యజ్ఞాన జ్యోతి సంస్థచే వివిధ రంగాల్లో సేవలందించిన ఎనిమిది మందికి మంగళవారం ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందజేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఎం.వెంకటేశ్ తెలిపారు. సోమవారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక త్యాగరాజస్వామి కళాక్షేత్రంలో లలిత కళలు కార్యక్రమాన్ని నిర్వహించి పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. వివిధ రంగాల్లోని ప్రముఖులైన తెలుగు కళావేదిక వ్యవస్థాపకులు కోడూరు సుమనశ్రీ, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ ప్రభాకర్, ఎస్.ముత్యాలు, సుట్లూరు వెంకటరమణ, ఉదయ్‌కుమార్, కమలాకర్, వేణు, హిందూజాగరణ సమితి వారిని ఘనంగా సత్కరించి పురస్కారాలు అందిస్తున్నట్లు వివరించారు.

బీసీలకు అండగా టీడీపీ


ఎంపీపీ, వైస్‌ఎంపీపీలను సత్కరిస్తున్న జగన్నాథం కుటుంబసభ్యులు

రామకుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు టీడీపీ అన్నివిధాలా అండగా నిలుస్తోందని ఆపార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. రామకుప్పం ఎంపీపీ, వైస్‌ఎంపీపీలుగా ఎన్నికైన సులోచన, వెంకట్రామగౌడులను బిరుగుండ్లపల్లె గ్రామంలో టీడీపీ గాండ్లతెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు జగన్నాథం కుటుంబసభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీపీ, వైస్‌ఎంపీపీలుగా బీసీలకు అవకాశం రావడం ఎంతో సంతోషమన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు టీడీపీని ఆదరిస్తూ వస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు గుర్తుపెట్టుకుని ఏ చిన్న అవకాశం వచ్చినా బీసీలకు తగు న్యాయం చేస్తున్నారన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం జగన్నాథం, అతని తండ్రి నారాయణశెట్టి, సోదరుడు దిలీప్‌లు గ్రామంలోని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, కుప్పం మాజీ ఎంపీపీ చౌడప్ప, నేతలు రామ్మూర్తి, నందారెడ్డి, బాలరాజు, పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, మురళీమోహన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు


గాయపడిన సురేష్, ఆనంద్

రామకుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బిరుగుండ్లపల్లె గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కథనం మేరకు.. బిరుగుండ్లపల్లె గ్రామానికి చెందిన సురేష్, తమిళనాడుకు చెందిన తన బంధువు ఆనంద్‌తో కలిసి సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో రామకుప్పం నుంచి బిరుగుండ్లపల్లెకు బయలుదేరారు. బిరుగుండ్లపల్లె గ్రామం సమీపిస్తుండగా చెరువు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో సురేష్, ఆనంద్‌లు తారు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు చికిత్స కోసం వారిని కుప్పం ఆసుపత్రికి తరలించారు.

దాతలకు ఘన సన్మానం


సోమలలో దాతలను సన్మానించిన నిర్వాహకులు

సోమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని స్వయంభేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపానికి సహకరించిన దాతలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఆలయ కల్యాణ మండపానికి రూ.2 లక్షలు విరాళం అందజేసిన దాతలు దొంగరి పార్వతమ్మ, సిద్దమల్లయ్యలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సోమశేఖర్, సీజీ. రెడ్డెప్ప, విశాంత్ర ఎల్ఐ వీ.వీ. రమణ, లింగయ్య, శంకర్‌రెడ్డి, మనోహర్, రామసిద్ధులు, బీవీఎస్ బాబు, నాగరాజు, రాజశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కుప్పం గంగ జాతర


జాతర పత్రిక చదువుతున్న పూజారి

కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవం మే 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయంలో సోమవారం సాయంత్రం ఈమేరకు పుర ప్రముఖుల సమక్షంలో పూజారులు, అర్చకులు జాతర పత్రిక రాసి అమ్మవారి ఎదుట పెట్టి పూజలు చేశారు. ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతర మే నెల 14వ తేదీన వినాయక పూజతో ప్రారంభమై, 21వ తేదీ రాత్రి జలావాస ఘట్టంతో ముగుస్తుంది. మే 14వ తేదీన వినాయక ఉత్సవం, 15న శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారి ఊరేగింపు, 16న శేష వాహన సేవ, 17న సింహ వాహన సేవ, 18న అశ్వ వాహన సేవ, 19న అగ్నిగుండ ప్రవేశం జరుగుతాయి. ప్రధాన ఘట్టాలైన గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపు 20, అమ్మవారి విశ్వరూప దర్శనం 21న నిర్వహిస్తారు. ఇదే రోజు రాత్రి అమ్మవారి కండ్లు తొలగించి జలావాసం చేయిస్తారు. జాతర పత్రికను సంప్రదాయబద్ధంగా రాసిన తర్వాత అమ్మవారి పాదాల ముందు పెట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బీఎంకే.రవిచంద్రబాబు, టీడీపీ కుప్పం పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఇతర పుర ప్రముఖులు వేద పండితులు బాలసుబ్రహ్మణ్య శాస్త్రి, పూజారి సోముస్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై దాడి.. కొడుకు కోడళ్లపై కేసు నమోదు

చౌడేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులపై దాడి చేసిన కొడుకుతోపాటు కోడలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఏకొత్తకోట పంచాయతీ అంకుతోటకు చెందిన వృద్ధ దంపతులైన చిన్నరెడ్డప్ప, రాజమ్మలకు కుమారుడు మనోహర్ రెడ్డి, కోడలు సరస్వతమ్మలకు గత కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈక్రమంలో తల్లిదండ్రులపై దాడి చేయడంతో సోమవారం వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్నిప్రమాదంలో వ్యవసాయ పరికరాల దగ్ధం


కాలిపోయిన బోరు, డ్రిప్ పైపులు

పెద్దపంజాణి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు మామిడి తోపునకు నిప్పంటించడంతో 10 మంది నిరుపేద మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమవారం మండలంలోని శివాడి గ్రామానికి చెందిన రైతులు నాగరాజు, సావిత్రమ్మ, మునస్వామి, నందగోపాల్, వి.నాగరాజు, ముత్తక్క, గోపి, రాజన్న, విజయరామిరెడ్డిలకు చెందిన 30 ఎకరాల మామిడి తోపు అగ్నికి ఆహుతైంది. దీంతో పాటు ఎం.నాగరాజుకు చెందిన బోరు, స్టార్టరు, డ్రిప్ పైపులు, వీపీసీ పైపులు కాలిపోయాయి. బాధిత రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆచార్య తుమ్మల రామకృష్ణ మృతికి సంతాపం

పలమనేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు చెందిన రచయిత, విమర్శకులు, ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి రామకృష్ణ అనారోగ్యంతో హైదరాబాద్‌లో సోమవారం ఉదయం మృతిచెందారు. ఆయన మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటని ఉమ్మడి చిత్తూరు జిల్లా రచయితల సమన్వయకర్తలు పలమనేరు బాలాజీ, సాకం నాగరాజు, సంతాపం వ్యక్తం చేశారు. పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామిరెడ్డి, రచయితలు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, దోర్నాదుల సిద్దార్థ, జి.శ్రీనివాస, మల్లిచెట్ల దేవేంద్ర, తదితరులు కూడా తుమ్మల రామకృష్ణ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు.

కృష్ణన్‌కు ఉగాది పురస్కారం


బీఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారం అందుకుంటున్న కృష్ణన్

బంగారుపాళ్యం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దళితులకు చేసిన సేవలకు గుర్తింపుగా మండలంలోని మహాసముద్రం గ్రామానికి చెందిన విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణన్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారం లభించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారాల్లో తనకు అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు తనను దుశ్శాలువాతో సన్మానించి, పురస్కారం, అవార్డు అందజేశారని ఆయన తెలిపారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తానని కృష్ణన్ చెప్పారు.

ముగిసిన శక్తి మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేక పూజలు

చిత్తూరు కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గిరింపేట గంగినేని చెరువు సమీపంలోని శక్తి మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేక పూజలు గత మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారి ఆలయ మహా కుంభాభిషేక పూజలతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

డీవై ఈవోకు ఘనంగా నివాళులు

పూతలపట్టు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్ సోమవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


పుంగనూరు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు


కుప్పంలో ప్రార్థనలకు వెళ్తున్న ముస్లింలు


సోమల మండలం నంజంపేటలో...


కల్లూరు ఈద్గాలో ప్రార్థనలు


పుంగనూరులో ర్యాలీగా వెళుతున్న ముస్లింలు

పుంగనూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ముస్లిం సోదరులు ఈద్గాల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసి సోమవారం రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ముస్లింలు మొదటగా రాతి మసీదు వద్దకు చేరుకుని అక్కడి నుంచి సామూహికంగా ర్యాలీగా ఎన్ఎస్‌పేట, బసవరాజ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, తోపు మఠం వద్ద ఉన్న ఎంఎం.మహ్మదాలీ ఈద్గాలకు వెళ్లారు. మండలంలోని రాంపల్లె, కుమ్మరగుంట, ఈడిగపల్లె, పాలెంపల్లె, చదళ్ల గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు ఈద్గా వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్. సలీం, కార్యదర్శి ఇబ్రహీం, కమిటీ సభ్యులు, సున్నీ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

● కుప్పం: కుప్పంలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాలకు ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈద్గాలలో ప్రార్థనలు చేశారు. మతపెద్దలు మహ్మద్ ప్రవక్త సూక్తులు వినిపించారు. ఈద్గాల బయట పేదలకు ముస్లింలు దానాలు చేశారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ విస్తరణ కమిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం తదితరులు లక్ష్మీపురం ఈద్గాకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. జమాత్ మతపెద్దలు చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి వారిని కలిశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వరాదని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించాలని నాయకులకు విన్నవించారు.

● పలమనేరు: పలమనేరులో సోమవారం రంజాన్ పండుగను ముస్లింలు జరుపుకున్నారు. పలమనేరు ఎద్దులసంత వీధిలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్, పలమనేరు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చాంద్‌బాషా, ముస్లింలు పాల్గొన్నారు.

● సోమల: సోమల మండలంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమల, నంజంపేట, పెద్దఉప్పరపల్లె, కందూరు, ఇరికిపెంట తదితర ప్రాంతాల్లో జరుపుకున్నారు.

● కల్లూరు: పులిచెర్ల మండలంలోని కల్లూరు, చిట్టారెడ్డిపేట, సువారపువారిపల్లి, జండామాను, ఎర్రపాపిరెడ్డిరెడ్డిగారిపల్లి, కొక్కువారిపల్లి, పులిచెర్ల, తురకపేట, మంగళంపేట, కొత్తపేట ఈద్గా మైదానాల్లో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు శాంతి, సామరస్యంతో ముందుకు నడవాలని, ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలగాలని సూచించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● రామకుప్పం: రామకుప్పం మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 9 గంటలకు రామకుప్పంలోని జామియా, మక్కా, మదీనా మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం అందరూ జామియా మసీదు వద్దకు చేరుకుని ఊరేగింపుగా బయలు దేరి ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ ప్రవక్త సందేశాలను ఆలకించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల పరిధి కొంగనపల్లె, చెల్దిగానిపల్లె, లింగాపురం, పల్లికుప్పం, 89పెద్దూరు, బల్ల, కెంచనబల్ల, గోవిందపల్లె, గెర్నిపల్లెల్లో ముస్లింలు ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


పలమనేరులో ముస్లింలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి శుభాకాంక్షలు


రామకుప్పం ఈద్గాలో ప్రార్థనలు


రొంపిచెర్లలో ముస్లింల ప్రార్థనలు

● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలంలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మసీదులో ప్రార్థనలు చేసిన అనంతరం ఊరేగింపుగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● రొంపిచెర్ల: రొంపిచెర్ల పట్టణంలో సోమవారం రంజాన్ సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు.

● చౌడేపల్లె: స్థానిక మేదరదొడ్డి, సంతగేటు, కోటూరు, దాదేపల్లె, పెద్దూరు, కాన్‌సాట్ మిట్ట, బైప్పల్లె, కొండయ్యగారిపల్లె, లద్దిగం తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆర్ఎంవో శారద సేవలు అభినందనీయం


ఆర్ఎంవో శారద, బాలసుబ్రహ్మణ్యంలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంవో శారద సేవలు అభినందనీయమని.. జీవితంలో విరమణ లేని ఉద్యోగం డాక్టర్ వృత్తేనని.. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సుదీర్ఘకాలంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆర్ఎంవో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆర్ఎంవో శారద, బాలసుబ్రహ్మణ్యం దంపతులను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగరాజు, కమిటీ సభ్యులు, పలమనేరు బాలాజీ కోఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న పొన్న యుగంధర్

గంగాధరనెల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షుడు రిజ్వానా, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియాజ్‌అలీ సంయుక్తంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం సాయంత్రం నేతలతో కలిసి యుగంధర్ బ్యాటింగ్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. రెండురోజుల పాటు జరగనున్న క్రికెట్ టోర్నమెంట్‌లో 13 టీమ్‌లు హాజరుకానున్నాయి. మండల టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి అత్తేహర్ అలీ, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, తూగుండ్రం టీడీపీ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, నేతలు శ్రీలతారెడ్డి, రాఘవేంద్ర, రాఘవ, రాజేష్, విజయ్, జగదీష్, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి అగస్థీశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయ పంగుణి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు శివకుమార్ గురుకుల్ తెలిపారు. మంగళవారం గ్రామోత్సవం, అంకురార్పణ, విఘ్నేశ్వర ఉత్సవాలు, 2న ధ్వజారోహణం, పంచమూర్తి ఉత్సవం, నగర కరుణీకర్ సంఘం ఆధ్వర్యంలో హంస వాహన సేవ, 3న సింహ, యాళి, 4న కేడియ, కామధేను, 5న భూత, శేష, 6న అధికార నంది, వృషభ, 7న కేడియ ఉత్సవం, గజ వాహనం, 8న రథోత్సవం, నీవానది వద్ద అభిషేకం, 9న బిక్షాండ ఉత్సవం, కల్యాణోత్సవం, బలిజ సంఘం ఆధ్వర్యంలో అశ్వ వాహనం, 10న సూర్య, చంద్రప్రభలు, 11న నటరాజ ఉత్సవం, యాగశాలపూజ ముగింపు, ధ్వజ అవరోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

4 నుంచి శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రాముఖ్యత కలిగిన కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. 4న విష్వక్సేన తిరుమంజనం, ఉత్సవం, 5న ధ్వజారోహణం, సప్తఉత్సవం, సింహ వాహనం, 6న శ్రీరామనవమి, హంస, సూర్యప్రభ వాహన సేవలు, 7న గరుడ, హనుమంత, 8న శేష, చంద్రప్రభ, 9న పల్లకిలో మోహిని అలంకారం, యాళి వాహనం, 10న వేణుగోపాల అలంకారం, వసంతోత్సవం, గజవాహనం, 11న రథోత్సవం, తోట ఉత్సవం, 12న పల్లకిలో వెన్నకృష్ణుడి అలంకారం, అశ్వ వాహనం, 13న పల్లకి ఉత్సవం, పుణ్యకోటి విమానం, 14న అష్టోత్తర శతకలశ తిరుమంజనం, 15న ధ్వజా అవరోహణం, వడయాత్తు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రద్దుచేయాలని నిరసన



బైరెడ్డిపల్లెలో ముస్లిం మైనారిటీల నిరసన


పుంగనూరులో ఎస్‌డీపీఐ నాయకుల నిరసన


సదుంలో..

బైరెడ్డిపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బైరెడ్డిపల్లెలో సోమవారం ముస్లింలు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించి బిల్లును రద్దుచేసి ముస్లిం మైనారిటీల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. మైనారిటీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు వెంటనే నిలుపుదల చేయాలని ఎస్ఐడీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పుంగనూరులో ఎస్‌డీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యూసఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● సదుం: సదుంలోని మదీనా, జామియా, ఇక్లాస్ మసీదుల్లో ఉదయం ప్రార్థనలు చేసుకున్న ముస్లిం సోదరులు ముస్లిం ఐక్యవేదిక పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎస్.జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

● శాంతిపురం: మండలంలో ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రార్థనలు నిర్వహించారు . అనంతరం వక్ఫ్ బోర్డు బిల్లులో సవరణను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం



అపస్మారకస్థితిలో ఉన్న టీడీపీ కార్యకర్త గణేష్

వెదురుకుప్పం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త ఒకరు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారకస్థితిలో ఉండగా గుర్తించి తిరుపతికి చికిత్స నిమిత్తం తరలించిన ఘటన కార్వేటినగరం మండలంలో సోమవారం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వేటినగరం మండలం నీడీ కండ్రిగ గ్రామానికి చెందిన దాసరి గణేష్(37) టీడీపీ కార్యకర్త. భవన నిర్మాణ కాంట్రాక్టరు కూడా. మండలంలోని చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారిలో చింతమండి సమీపంలో గణేష్ రోడ్డు పక్కన బైక్ పార్కింగ్ చేసి సమీపంలో ఓ మామిడి తోటలోకి వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. అతడి నోటి నుంచి నురుగు వస్తూ.. అపస్మారస్థితిలో ఉండటంతో మొదట కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతికి తరలించినట్లు చెప్పారు. నిజానిజాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

దిబ్బలు తొలగించకపోతే జనసైనికులతో శ్రమదానం

● మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్

వెదురుకుప్పం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గాదంకి, ఎగువ ఎర్రమరాజుపల్లె పంచాయతీలోని గ్రామాల్లో, రోడ్డు పక్కన, పాఠశాల,

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పంచాయతీ కార్యాలయం ముందు ఉన్న పేడ దిబ్బలు, చెత్తకుప్పలను మంగళవారం సాయంత్రానికి పంచాయతీ ఉద్యోగులు తొలగించకపోతే జనసైనికులతో కలసి శ్రమదానం చేసి తొలగిస్తామని ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రభుత్వం ఆదేశించినా తొలగని పేడదిబ్బలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. సానుకూలంగా స్పందించిన యుగంధర్ పంచాయతీ ఉద్యోగులు మంగళవారం సాయంత్రానికి తొలగించకపోతే జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి వాటిని తొలగించి, పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపడతామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయకుండా ఎగువ ఎర్రమరాజుపల్లె పంచాయతీ కార్యాలయం ముందే పేడదిబ్బల నిల్వలు ఉండటేమిటని ప్రశ్నించారు. ఇలాంటి వారిపై పర్యవేక్షణ మెరుగుపరచాల్సి ఉందన్నారు.

డీవైఈవోకు ఘనంగా నివాళులు



చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్ సోమవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ నేతాజి, ఉపాధ్యాయులు లోకనాథరెడ్డి, సురేంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి, నాదముని, మోహన్, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పైపులైన్ పనులు



విజయపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచివానత్తంలో పైపులైన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ ముందస్తుగా ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి అంకమ్మ కాలనీ వరకు పైపులైన్ వేశారు. బూచివానత్తంలో కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండలంలోని కోసలనగరంలో నాలుగు రోజుల పాటు తాగునీటి సమస్య చోటు చేసుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు వీధుల్లో నీరు సక్రమంగా రాకపోవడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల స్కూటర్ అందజేత



దివ్యాంగుడికి స్కూటర్ అందిస్తున్న చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీబొమ్మరాజుపురం ఆది ఆంధ్రవాడకు చెందిన నవీన్ దివ్యాంగుడు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నవీన్ చురుగ్గా పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడంతో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం తన సొంత నిధులతో మూడు చక్రాల స్కూటర్‌ను తీసి ఇస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల హామీలో భాగంగా ఉగాదిని పురస్కరించుకుని సోమవారం దివ్యాంగుడైన నవీన్‌ను సన్మానించి, రూ.1.50 లక్షల విలువైన మూడు చక్రాల స్కూటర్‌ను అందించారు. దీంతో టీడీపీ నాయకులు, నవీన్ తల్లిదండ్రులు చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పొన్న యుగంధర్

గంగాధరనెల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షుడు రిజ్వానా, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ సంయుక్తంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం సాయంత్రం నేతలతో కలిసి యుగంధర్ బ్యాటింగ్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. రెండురోజుల పాటు జరగనున్న క్రికెట్ టోర్నమెంట్‌లో 13 టీమ్‌లు హాజరుకానున్నాయి. ఈకార్యక్రమంలో మండల టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి అత్తేహార్ అలీ, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, తూగుండ్రం టీడీపీ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, నేతలు శ్రీలతారెడ్డి, రాఘవేంద్ర, రాఘవ, రాజేష్, విజయ్, జగదీష్, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

స్వయంభు సిద్ధేశ్వరుడికి పాలాభిషేకం



కొండ మల్లీశ్వరుడి సేవలో భక్తులు

వెదురుకుప్పం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు. అదేవిధంగా చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి సోమవారం రుద్రాభిషేకం చేశారు. ఆ తర్వాత పూల అలంకరణ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో శాస్త్రోక్తం పాలాభిషేకం చేశారు. ఉభయదారులుగా నక్కలాంపల్లికి చెందిన చెంగ్రాలాయులు, సతీష్ కుటుంబీకులు వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివ, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు.

వైసీపీ స్వార్థానికి మూడు పంచాయతీల బలి..!

● టీడీపీ కంచుకోటలో గెలవాలని మెర్జింగ్... కోర్టు స్టే

● నిధులు రాక అభివృద్ధికి బ్రేక్

● పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇచ్చినా ఫలితం లేదంటున్న ప్రజలు

పెనుమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల స్వార్థానికి మండలంలోని పెనుమూరు, చార్వాగానిపల్లె, పెద్దకలికిరి పంచాయతీలు బలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పెనుమూరు, పెద్దకలికిరి పంచాయతీలు తెలుగుదేశం పార్టీకి కంచుకోట. ఐదు దఫాలుగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. మండల కేంద్రంలో తమ జెండా ఎలాగైనా ఎగురవేయాలని వైసీపీ నాయకులు పెనుమూరుకు అనుకుని ఉన్న చార్వాగానిపల్లె పంచాయతీని పెనుమూరులో విలీనం చేస్తే తమకు అనుకూలంగా మారుతుందని భావించారు. అలాగే పెద్దకలికిరి పంచాయతీని రెండుగా విభజించి మొరవకండ్రిగ పంచాయతీని వేరు చేస్తే కనీసం ఆ ఒక్క పంచాయతీనైనా గెలవచ్చని భావించారు. ఇందుకుగాను 2021లో గుట్టుచప్పుడు కాకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎంపీడీవో ద్వారా డీపీవోకు పంపించారు. వారు కమిషనరుకు పంపడంతో మెర్జింగ్ గెజిట్ వచ్చాకనే ప్రజలకు తెలిసింది. ఆ తర్వాత ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు వస్తున్న విషయాన్ని కూడా ఎవరికీ తెలియకుండా అదేరోజు అరగంట ముందుగా పంచాయతీలోని వైసీపీ నాయకులకు మాత్రమే తెలియజేశారు. దీంతో వారు వచ్చి పంచాయతీల విభజనకు అభ్యంతరం లేదని అధికారుల ముందు తెలిపారు. దీంతో అధికారులు పంచాయతీ మెర్జింగ్, డివైడింగ్ ప్రక్రియను పూర్తిచేసి ప్రొసీడింగ్స్‌ను అన్ని శాఖలకు పంపించారు. దీన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కోర్టును ఆశ్రయించగా.. స్టే విధించింది.

అభివృద్ధి ఊసే లేని చార్వాగానిపల్లె, పెద్దకలికిరి

చార్వాగానిపల్లె అసలే చిన్న పంచాయతీ. నిధులు అంతంత మాత్రమే. ఈ పంచాయతీని పెనుమూరు పంచాయతీలో విలీనం చేశాక కోర్టు స్టే విధించడంతో అభివృద్ధి పనులు ఏవీ జరగలేదు. వీధి దీపాలు కావాలని సచివాలయానికి వెళ్లి అడిగితే పెనుమూరులో అడగాలని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో క్లోరినేషన్ చేసి రెండేళ్లయ్యింది. పెద్దకలికిరి పంచాయతీలోనూ ఇదే దుస్థితి నెలకొంది.



చార్వాగానిపల్లె సచివాలయం

రూ.కోటికి పైగా నిధులు వెనక్కు

కోర్టులో స్టే ఉండటంతో మూడు పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలు ఆగిపోయాయి. నిధులకు బ్రేక్ పడింది. దీంతో అధికారులు పంచాయతీల్లో ఏ చిన్న అభివృద్ధి పని కూడా చేయలేకపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ పంచాయతీల మెర్జింగ్ వ్యవహారాన్ని పరిష్కరిస్తుందేమోనని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇచ్చినా ఫలితం శూన్యం

చార్వాగానిపల్లె పంచాయతీ పేరు ఉపాధి హామీ వెబ్‌సైట్‌లో కనిపించడంలేదు. దీంతో ఉపాధి హామీ పనులను కోల్పోతున్నాం. మా గ్రామాల్లో ఏ అభివృద్ధి పనిచేయలేకున్నాం. పలుమార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను అయినా కలిసి పరిస్థితిని వివరిస్తాం.

- చార్వాగానిపల్లె పంచాయతీ ప్రజలు







చిత్తూరు గిరింపేట ఈద్గాలో సోమవారం నిర్వహించిన రంజాన్ ప్రార్థనల్లో పోలీస్ పహారాలో పాల్గొన్న ముస్లింలు - ఈద్గా మైదానం నిండిపోవడంతో గిరింపేట మెయిన్ రోడ్డుపై మండుటెండలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు - యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామంలో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రేమ, పరోపకారానికి ప్రతీక రంజాన్

గంగాధరనెల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, పరోపకారానికి ప్రతీక రంజాన్ పర్వదినం అని ఆవలకొండలో ముస్లింల మతగురువులు మౌలానా అబిదాలి, నబీల్ రజ, మౌలానా మహమ్మద్ కుమేల్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలోని అంజుమన్ అబ్బాషియా కమిటీ ఛైర్మన్, తూగుండ్రం పంచాయతీ మాజీ సర్పంచ్ ఎస్.హెచ్.నియాజ్‌అలీ, అబ్బాషియా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రహమత్ అలీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అజాఖానా జహారాలో ముస్లింలకు మతగురువులు ఖురాన్ సందేశాన్ని వివరించారు. అనంతరం ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ఆవలకొండలో గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆవలకొండ అంజుమన్ అబ్బాషియా కమిటీ వైస్ ఛైర్మన్ యగ్బాల్ హుస్సేన్, కోశాధికారి షాకిర్ అలీ, ముస్లిం పెద్దలు జాఫర్ అలీ, మెహిదిఅలీ, బాబు, చాన్‌ది అలీ, అషక్ అలీ తదితరులు పాల్గొన్నారు. అలాగే గంగాధరనెల్లూరు అబ్బాస్‌కాలనీ, బాలగంగనపల్లె, ఆవలాపురం ఇందిరానగర్ కాలనీ, వీరకనెల్లూరు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలు జరుపుకుని, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

యాదమరి: మండల పరిధిలోని యాదమరి, చిన్నరెడ్డిపల్లి, నూరేనగర్, మండల వ్యాప్తంగా వున్న ఈద్గాల వద్ద మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 14 కండ్రిగ ముస్లింవాడలో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, మైనార్టీ అధ్యక్షుడు మునీర్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: నగరి పట్టణంలో, వేలావడిలో, మీరాసాహెబ్‌పాళెంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. నగరి మసీదు వద్ద మాజీ మున్సిపల్ ఛైర్మన్ కేజే కుమార్, ఆయన కుమారులు రాము, మురళి ముస్లిం సోదరులకు స్వీట్లు పంచగా, నగరి సీఐ విక్రమ్ పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని కోసలనగరం, చెంగమ నాయుడు కండ్రిగ తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మసీదులో ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

ఐరాల: ఐరాల మండలంలోని మోటాకంపల్లె, చిగరపల్లె, ఐరాలలో మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఐరాల ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. అనంతరం బంధు, మిత్రులకు ఖీర్, బిర్యానీ పంచారు. కార్యక్రమంలో ముతవళి హైదర్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, ముస్లింలు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని ముస్లింలు ఈద్‌ఉల్‌ఫితర్ పండుగను ఘనంగా నిర్వహించారు. మసీదులలో ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండలం కేంద్రంలో, బసివిరెడ్డిపల్లె, పుల్లూరు, ముద్దికుప్పం మసీదుల్లో సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో అల్లాను ప్రార్థించి, ఒకరికొకరు శుభాకంక్షాలు తెలుపుకున్నారు. మహబూబ్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని మసీదుల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలను చేశారు.

● వెదురుకుప్పం మండలం వేపేరి, పచ్చికాపల్లం, తాటిమాకులపల్లి తదితర ప్రాంతాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

బంగారుపాళ్యం: మండలంలోని పాలేరు దగ్గర ఉన్న ఈద్గాకు చేరుకున్న ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గుడిపాల: మండలంలోని 190 రామాపురం, గట్రాళ్లమిట్ట, గుర్రాలమిట్ట, తుమ్మలవారిపల్లి, కోటూరు, మండిక్రిష్ణాపురం, సర్దార్‌మిట్ట, రాసనపల్లి గ్రామాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబు, రజిమాన్, అమీన్ బాషా, అక్బర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



ఆవలకొండలో మాట్లాడుతున్న మతగురువు మౌలానా మహమ్మద్ కుమేల్



నగరిలో మసీదు వద్ద స్వీట్లు పంచుతున్న కేజే కుమార్, సీఐ విక్రమ్



పీఎస్.అగ్రహారం ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ఐరాల ముస్లిం సోదరులు



ఎస్ఆర్‌పురం మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు







కార్వేటినగరంలో - వెదురుకుప్పం మండలం వేపేరిలో - బంగారుపాళ్యంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

ముగిసిన శక్తి మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేక పూజలు

చిత్తూరు కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గిరింపేట గంగినేని చెరువు సమీపంలోని శక్తి మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేక పూజలు గత మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారి ఆలయ మహా కుంభాభిషేక పూజలతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

కృష్ణన్‌కు ఉగాది పురస్కారం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారం అందుకుంటున్న కృష్ణన్

బంగారుపాళ్యం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దళితులకు చేసిన సేవలకు గుర్తింపుగా మండలంలోని మహాసముద్రం గ్రామానికి చెందిన విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణన్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారం లభించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారాల్లో తనకు అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు తనను దుశ్శాలువాతో సన్మానించి, పురస్కారం, అవార్డు అందజేశారని ఆయన తెలిపారు. దళితుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కృష్ణన్ చెప్పారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం



రాజమ్మ, సుబ్రహ్మణ్యంరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

విజయపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన రాజమ్మ, సుబ్రహ్మణ్యంరాజు దంపతులను సోమవారం మండల టీడీపీ నాయకులు శాలువా, పూలమాలతో మహారాజపురంలో ఘనంగా సన్మానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి చేసిన సేవకు తగిన గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, నాయకులు కపిల్, సెల్వం, ఆర్ముగం రెడ్డి, శ్యామువేలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే దహనక్రియలు

● ఇబ్బంది పడుతున్న స్థానికులు



రోడ్డు పక్కన నిర్వహిస్తున్న దహనక్రియలు

నింద్ర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలం శ్రీరామపురం పంచాయతీ పెద్ద పట్టెడ గ్రామానికి శ్మశాన స్థలం లేదు. ఈ గ్రామంలో నుంచి వెళ్లే కొప్పేడు - కోట మంగాపురం తారురోడ్డుకు ఇరువైపులా దహనక్రియలు నిర్వహించుకుంటున్నారు. ఈ మార్గంలో సుమారు ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి రావడంతో భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా శ్మశానానికి స్థలం కేటాయించాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి అగస్థీశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయ పంగుణి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు శివకుమార్ గురుకుల్ తెలిపారు. మంగళవారం గ్రామోత్సవం, అంకురార్పణ, విఘ్నేశ్వర ఉత్సవాలు, 2న ధ్వజారోహణం, పంచమూర్తి ఉత్సవం, నగర కరుణీకర్ సంఘం ఆధ్వర్యంలో హంస వాహన సేవ, 3న సింహ, యాళి, 4న కేడియ, కామధేను, 5న భూత, శేష, 6న అధికార నంది, వృషభ, 7న కేడియ ఉత్సవం, గజ వాహనం, 8న రథోత్సవం, నీవానది వద్ద అభిషేకం, 9న బిక్షాండ ఉత్సవం, కల్యాణోత్సవం, బలిజ సంఘం ఆధ్వర్యంలో అశ్వ వాహనం, 10న సూర్య, చంద్రప్రభలు, 11న నటరాజ ఉత్సవం, యాగశాలపూజ ముగింపు, ధ్వజ అవరోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

4 నుంచి శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రాముఖ్యత కలిగిన కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. 4న విష్వక్సేన తిరుమంజనం, ఉత్సవం, 5న ధ్వజారోహణం, సప్తఉత్సవం, సింహ వాహనం, 6న శ్రీరామనవమి, హంస, సూర్యప్రభ వాహన సేవలు, 7న గరుడ, హనుమంత, 8న శేష, చంద్రప్రభ, 9న పల్లకిలో మోహిని అలంకారం, యాళి వాహనం, 10న వేణుగోపాల అలంకారం, వసంతోత్సవం, గజవాహనం, 11న రథోత్సవం, తోట ఉత్సవం, 12న పల్లకిలో వెన్నకృష్ణుడి అలంకారం, అశ్వ వాహనం, 13న పల్లకి ఉత్సవం, పుణ్యకోటి విమానం, 14న అష్టోత్తర శతకలశ తిరుమంజనం, కల్యాణోత్సవం, పుష్పపల్లకి సేవ, 15న ధ్వజా అవరోహణం, వడయాత్తు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.